క్లుప్తంగా

పుట్ట మట్టితో లింగ ప్రతిష్ఠాపన



మోమిన్‌పేట: మోమిన్‌పేటలోని శంభు మహాదేవాలయంలో 40 రోజులుగా బస్వరాజ్, మల్లేశ్వరి దంపతులు పుట్ట మట్టితో 1116 లింగాలను తయారు చేసి ప్రతిష్ఠించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆ దంపతులు కఠోర దీక్షతో రోజు కొన్ని లింగాల చొప్పున చేశారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం కంటే ముందు కఠోర దీక్ష చేస్తామని ఆ దంపతులు సోమవారం పేర్కొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న హన్మంతు

దౌల్తాబాద్: మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కోట్లహన్మంతు సోమవారం మండలంలోని బాలంపేట, బిచ్చాల గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులు చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములు, రాజప్ప, శేఖర్, వెంకటరాములు తదితరులున్నారు.

పంటల నమోదు వేగవంతం



పంటల నమోదు చేస్తున్న ఏఈఓ

దౌల్తాబాద్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డిజిటల్ పంటల నమోదు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఏఈఓలు ఆయా గ్రామాల్లో మొదటి విడతగా ఎలాంటి పొరపాట్లు లేకుండా పంటల నమోదు చేస్తున్నారు. అలాగే రైతులకు పంటల సాగుపై పలు సూచనలు సలహాలు అందిస్తున్నారు. సోమవారం సుల్తాన్‌పూర్, దౌల్తాబాద్‌లో ఏఈఓలు నిఖిల్, వైశాలి పంటల నమోదు చేశారు.

శ్రీవారి సేవకు తరలిన రేగడిమైలారం భక్తులు



దాసరి రాములు బృందం సభ్యులు

బొంరాస్‌పేట: తిరుమల తిరుపతిలో వారం రోజుల పాటు శ్రీవారి సేవకు మండల పరిధిలోని రేగడిమైలారం నుంచి రెండు బృందాల భక్తులు సోమవారం తరలివెళ్లారు. గ్రామంలోని ఆలయంలో దాసరి రాములు, నెల్లి అంజిలయ్య బృందాలు పూజలు చేసి బయలుదేరారు. ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్ రెండు బృందాల నుంచి 27మంది భక్తులు సేవలకు వెళ్లారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల 7వరకు సేవలో ఉంటామని తెలిపారు. ఆయా కుటుంబాలవారు భక్తితో సాగ నంపారు.

తెలుగు ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి

కొందుర్గు: చౌదరిగూడ ఉన్నత పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయుడిని నియమించాలని స్థానిక బీజేపీ నాయకులు సోమవారం ఎంఈఓ కిరణ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ పాఠశాలలో తెలుగు బోధించడానికి ఉపాధ్యాయులు లేరన్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు తెలుగు ఉపాధ్యాయులు ఉండగా.. ఓ ఉపాధ్యాయురాలు డిప్యూటేషన్‌పై వెళ్లారని, మరో ఉపాధ్యాయురాలు మెటర్నిటీ సెలవుపై వెళ్లారని వాపోయారు. దీంతో విద్యార్థులకు తెలుగు బోధించడానికి ఉపాధ్యాయులు లేరన్నారు. ఏ పాఠశాలలోనైనా తెలుగు ఉపాధ్యాయులు ఉన్నట్లయితే డిప్యూటేషన్‌పై చౌదరిగూడ ఉన్నత పాఠశాలకు పంపించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు రామ్‌లక్ష్మణ్, అనిల్ ఉన్నారు.

సోలార్ కంచె.. పంటను రక్షించె

- వానరాలు, వన్యప్రాణుల బెడదకు చెక్
- తక్కువ పెట్టుబడితో భద్రత
- ఆసక్తి చూపుతున్న రైతులు



దౌల్తాబాద్‌లో రైతు ఏర్పాటు చేసిన సోలార్ కంచె

దౌల్తాబాద్: రైతులు సాగు చేస్తున్న పంటలను అడవి జంతువులు, వానరాలు, వన్యప్రాణుల నుంచి రక్షించుకోవడానికి సోలార్ కంచె వినియోగిస్తున్నారు. గతంలో పంటలను కాపాడుకోవడానికి అన్నదాతలు పగలు, రాత్రి తేడా లేకుండా నిద్రాహారాలు మాని నిత్యం పంట పొలాల్లోకి కాలం గడిపేవారు. అయితే సోలార్ కంచెతో అడవి జంతువులతో పాటు మనుషులకు కూడా ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో వీటి వినియోగం పెరుగుతుంది.

మండలంలో..

మండలంలోని నందారం, నీటూరు, దౌల్తాబాద్, చల్లాపూర్, ఈర్లపల్లి, అంతారం, తదితర గ్రామాల్లో రైతులు ఈ సోలార్ కంచెను ఏర్పాటు చేసుకున్నారు. రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, కంది, శనగ, ఇతర పంటలు నిత్యం అడవిపందులు, కోతుల దాడుల్లో దెబ్బతింటున్నాయి. దీంతో పంటలు కాపాడుకోవడానికి అన్నదాతలు సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్నారు.

తక్కువ ఖర్చు

2 నుంచి 20 ఎకరాలు సాగు చేస్తున్న రైతులు సోలార్ కంచెను ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో రూ.8వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడితో రైతులకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉంటున్నాయి. కర్రలు, జీఏవైర్, ఇన్సులేటర్, సోలార్ ప్యానెల్, బ్యాటరీలు వినియోగించి చేను చుట్టూ కంచెను ఏర్పాటు చేస్తున్నారు. కంచెకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే వెసులుబాటు ఉండడంతో రైతులు పగలు, రాత్రి పంటలకు కంచెను ఏర్పాటు చేస్తున్నారు. బ్యాటరీ నుంచి వచ్చే డీసీ విద్యుత్‌తో జంతువులు కంచెను తగిలితే స్వల్పంగా షాక్ తగులుతుండడంతో వన్యప్రాణాలు బెదిరిపోతున్నాయి. ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో రైతులు సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది

ఎంఈఓ హబీబ్ అహ్మద్



ఉద్యోగ విరమణ పొందుతున్న పాండురంగయ్య దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కుల్కచర్ల: సమాజంలో అత్యంత గౌరవప్రదమైన ఉద్యోగాల్లో ఉపాధ్యాయ వృత్తి ఒకటని కుల్కచర్ల ఎంఈఓ హబీబ్ అహ్మద్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇప్పాయిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పాండురంగయ్య ఉద్యోగవిరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక విద్యార్థి సర్వతోముఖాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థికి చదువుతో పాటుగా సమాజంలోని సామాజిక అంశాలపై అవగాహనను కల్పిస్తామన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు ఉద్యోగంలో లేకున్నా విద్యార్థుల మనస్సులో చిరకాలం నిలిచిపోతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దోమ ఎంఈఓ వెంకట్, చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్, పీఆర్టీయూ కుల్కచర్ల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, ఉపాధ్యాయులు సతీశ్, పరందాములు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణం



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు సిద్ధం కావాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన అనంతసాగర్ గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 400 పీట్లు స్థలం ఉండి నిర్మించేందుకు అవకాశం ఉన్న స్థలాన్ని చూపించడంతో పాటుగా పునాది అనంతరం రూ.లక్ష, గోడలు పూర్తయ్యాక రూ.లక్ష, స్లాబ్ అయ్యాక మరొక రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక రూ.రెండు లక్షలను అధికారులు పరిశీలించిన అనంతరం బిల్లుల రూపంలో ఇస్తామన్నారు. గ్రామంలో 163 మందికి ఇళ్లు మంజూరయ్యాయని ప్రకటించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ సయ్యద్ మక్రం బాబ, ఏఈ ఎండీ.సందాని, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లోనూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్ అన్నారు. ఆదివారం కొందుర్గు మండలంలో నిర్వహించిన కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్స్ పోటీలలో భాగంగా మంది పల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం పాఠశాలలో వారికి తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువు ఒక్కటే అనే విధానంతో కాకుండా అనేక అంశాల్లో రాణించాలన్నారు. కుంగ్‌ఫూ, కరాటే పోటీలలో సౌజన్య, యశస్విని మొదటిస్థానంలో నిలవగా తేజశ్రీ, నిహారిక, చరణ్‌లు ద్వితీయస్థానంలో నిలిచారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శకమిటీ చైర్‌పర్సన్ యాదమ్మ, ఉపాధ్యాయులు యాదయ్య, మురళీధర్, విజయశ్రావణ్ కుమార్, అనిల్, శ్రీను, జహీర్, సీఆర్పీ విజయకుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సన్నద్ధతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లెక్చరర్ సూర్యప్రకాశ్‌రెడ్డి

శంకర్‌పల్లి: విద్యార్థులు పరీక్షల సమయంలో గందరగోళానికి గురి కావొద్దని హైదరాబాద్ శ్రీచైతన్య కళాశాల లెక్చరర్ సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల సమయంలో ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, ఆదేవిధంగా ఎలా రాస్తాం, పేపర్ ఎలా వస్తుందన్న ఆలోచనలు మానుకోవాలని సూచించారు. పరీక్షలకు ముందే ప్రణాళిక ప్రకారం చదువుకొని, సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వొద్దు



విద్యార్థుల తల్లిదండ్రులతో మ్యాజిక్‌బస్ సిబ్బంది, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: చిన్న పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వరాదని కుల్కచర్ల జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జైపాల్ రెడ్డి సూచించారు. సోమవారం మ్యాజిక్‌బస్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులతో కలిసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకునే పిల్లలకు ఫోన్లు ఇవ్వడంతో ఏకాగ్రతను కోల్పోతారన్నారు. చదువు పట్ల అశ్రద్ధ చూపుతారన్నారు. స్వచ్ఛత ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంచంద్రయ్య, మెడికల్ అసిస్టెంట్ వెంకట్, మ్యాజిక్ బస్ సిబ్బంది నర్సింలు, మురళీకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో జిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. సోమవారం జిమ్స్ ఆస్పత్రి డాక్టర్ రఘునందన్ ఆధ్వర్యంలో వైద్యులు 213 మంది రోగులను పరీక్షించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. వీరిలో 13 మంది రోగులను మెరుగైన చికిత్స కోసం శంషాబాద్ సమీపంలో ఉన్న ముచ్చింతల్‌లోని జిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

కనుల పండువగా లింగ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గేటు సమీపంలో ఉన్న పల్లెగూడ హనుమాన్ దేవాలయం వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. జై భరత్ మాత సేవ సమితి, న్యూ ఢిల్లీ ఆశ్రమ గురువు మల్లినాథ్ మహరాజ్ నిరుగుడి స్వామి విచ్చేసి శివలింగ ప్రతిష్ఠాపన సోమవారం చేశారు. శివస్వాములు, గ్రామస్తులు గంగా నీళ్లతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయానికి భూమి విరాళంగా ఇచ్చిన అగ్గనూర్ అశోక్, శోభవతి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కరన్‌కోట్, ఓగిపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్‌తో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మల్లినాథ్ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఇప్పటి వరకు ఆయన దేశవ్యాప్తంగా 7763లు శివలింగాలు స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, పరుశురాం, విజయ్, అంజిలప్ప, అనంతప్ప, నర్సింలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్: గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సంపూర్ణ సహకారం అందిస్తున్నారని సిరిగిరిపేట్ గ్రామస్తులు అన్నారు. సోమవారం ఎన్‌ఆర్‌ఈఏస్‌లో మంజూరైన నిధుల్లో భాగంగా ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రభుత్వ పాఠశాల ప్రహరీ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చొరవతో పీడబ్ల్యూ రోడ్డు నుంచి సిరిగిరిపేట్ వరకు బీటీ రోడ్డు పూర్తి చేశారన్నారు. మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విడతల వారీగా నిధులు మంజూరు చేయిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటప్ప, భద్రు, బిచ్చిరెడ్డి, బాల్‌రాజు, ఆశన్న, రాములు, హన్మంత్, శివకుమార్, ఎల్లప్ప ఉన్నారు.

శివార్చనతో ముక్తికి మార్గం



పడిపూజలో పాల్గొన్న శివస్వాములు

కొందుర్గు: శివార్చనతో ముక్తికి మార్గం కలుగుతుందని గురుస్వామి భూపాలచారి అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ, జ్యోతిర్ముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో గ్రామంలోని వీధులు మార్మోగాయి. కార్యక్రమంలో గురుస్వాములు యాదవరెడ్డి, నర్సింలు, సత్యనారాయణ, యాదయ్య, వెంకట్రామిరెడ్డి, పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



విద్యార్థుల నైపుణ్యం తెలుసుకుంటున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. సోమవారం ఆయన కోట్‌పల్లి మండలం ఎన్నారంలోని ఏఐ విద్య పైలెట్ ప్రాజెక్టు కింద పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎఫ్‌ఎల్‌ఎన్ సామర్థ్యాన్ని సాధించాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పైలెట్ ప్రాజెక్టు పాఠశాలలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఏఐ విద్యతో ఎఫ్‌ఎల్‌ఎన్‌లో భాష నైపుణ్యంతో పాటు గణిత సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రామ్ కిషోర్, హెచ్‌ఎంలు శారద, శేఖర్, సీఆర్‌పీ నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో శివ, హనుమాన్ దేవాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి ఆయన హాజరై స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని, తద్వార ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీకి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శాంతమ్మ, నాయకులు సుధీర్, భిక్షపతి, విష్ణుమూర్తి, శేఖర్, నారాయణ, చారి, మురళీ, అంబటి శేఖర్, విజయ, కృష్ణవేణి, పద్మమ్మ, జగదీశ్, పరమేశ్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

షాబాద్: ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి స్రవంతి పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పాడి పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు, చూడు పరీక్షలు, నట్టల నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు.

‘డబుల్’ ఇళ్లు కేటాయించేదెప్పుడో?

- అజీజ్‌నగర్‌లో నిర్మాణాలు పూర్తయినా అర్హులకు అందని గృహాలు
- సురంగల్‌లో అసంపూర్తిగానే దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు



సురంగల్‌లో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం

మొయినాబాద్: పదేళ్లుగా కలలు కంటున్నా డబుల్ బెడ్రూం ఇళ్లు అర్హులకు దక్కడం లేదు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డబుల్ ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇప్పటికీ లబ్ధిదారులకు అందడం లేదు. నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించింది. అందులో భాగంగా మొయినాబాద్ మండలంలోని సురంగల్, అజీజ్‌నగర్, కనకమామిడి, చిలుకూరు, చిన్నమంగళారం, తోలుకట్ట తదితర గ్రామాలకు 2016లో ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చేతులమీదగా పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. ఆ తరువాత రెండేళ్లకు సురంగల్, అజీజ్‌నగర్ గ్రామాల్లో మాత్రమే పనులు మొదలు పెట్టారు. సురంగల్‌కు 20 డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు కాగా 16 ఇళ్ల నిర్మాణ పనులు మాత్రమే చేపట్టారు. అవికూడా అసంపూర్తిగానే ఉన్నాయి. అజీజ్‌నగర్‌లో 40 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు ఎనిమిదేళ్ల పాటు పనులు కొనసాగాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు వాటిని ప్రారంభించలేదు.

రెండేళ్ల క్రితమే అర్హుల గుర్తింపు

గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు ఇచ్చేందుకు రెండేళ్ల క్రితమే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించారు. అసెంబ్లీ ఎన్నికల ముందే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి అప్పగించాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. కానీ అప్పట్లో పనులు పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులకు అప్పగించలేదు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వంలోనైనా డబుల్ బెడ్రూం ఇళ్లు లబ్ధిదారులకు అందుతాయనుకున్నా అందని ద్రాక్షలా మారాయి. ఇళ్లు ఎప్పుడిస్తారో.. తమకు సొంతింటి కల ఎప్పుడు తీరుతుందోనని లబ్ధిదారులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

కరెంటు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది

అజీజ్‌నగర్‌లో డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వాటికి కరెంటు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ఆయా శాఖల అధికారులకు తెలియజేశాం. ఆ పనులు పూర్తయితే లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించవచ్చు. సురంగల్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ, మొయినాబాద్